క్లుప్తంగా

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

నర్సింహులపేట/తొర్రూరు/నెల్లికుదురు/చిన్నగూడూరు/కొత్తగూడ/గంగారం: నర్సింహులపేట ఎంపీడీఓగా పి.రాధిక, తొర్రూరు ఎంపీడీఓగా కె. వెంకటేశ్వర్లు, నెల్లికుదురు ఎంపీడీఓ సింగారపు కుమార్, చిన్నగూడూరు ఎంపీడీఓగా కిన్నెర యాకయ్య, కొత్తగూడ ఎంపీడీఓగా రోజారాణి, గంగారం ఎంపీడీఓగా మునావర్ బేగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

సీరోలు ఎస్సై నగేష్ బదిలీ

మహబూబాబాద్ రూరల్: సీరోలు ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్.నగేష్ హైదరాబాద్‌లోని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో విభాగానికి బదిలీ అయ్యారు. ఈమేరకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టార్‌ల్లో వివిధ కోర్సుల్లో ఒక నెలపాటు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో హైదరాబాద్‌లోఉచిత శిక్షణ ఉపాధి కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి.శ్రీనివాస్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మైనార్టీ స్టడీసర్కిల్.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తు పత్రాలను హైదరాబాద్ తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. డిగ్రీలో 50శాతం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 91825 40680 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలి



మహబూబాబాద్ అర్బన్: ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఏఐ, శాస్త్రీయ సాంకేతిక విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖుషి పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంజుల, చైర్మన్ సుమన్, నాయకులు అజ్మీరా సురేష్ , ఖలీల్ పాషా, పోతురాజు రాజు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు



గూడూరు: మండలంలోని నాయకపల్లి గ్రామంలో ఆషాఢమాస శుక్రవారం పురస్కరించుకొని స్థానిక రామాలయంలో మహిళలు గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు.

సమస్యల వలయంలో గ్రామాలు

- బురదమయంగా రహదారులు
- పనిచేయని చేతిపంపు
- బస్సుల్లో విద్యార్థుల రద్దీ

పనిచేయని చేతిపంపు



కురవి: మండలంలోని నల్లెల్ల స్టేజీ వద్ద కురవి–ఖమ్మం వెళ్లే 365/ఏ జాతీయ రహదారి పక్కన ఉన్న చేతిపంపు పనిచేయడం లేదు. కొన్ని నెలల నుంచి చేతిపంపు పనిచేయకపోవడంతో నల్లెల్ల, తిర్మలాపురం, గాజతండా, టేకుల తండాల నుంచి కురవి మీదుగా మహబూబాబాద్, అక్కడి నుంచి ఖమ్మంకు వెళ్లే ప్రయాణికులు నల్లెల్ల స్టేజీ వద్ద బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు. చేతిపంపు పనిచేయకపోవడంతో ప్రయాణికులు, బాటసారులు మంచినీటి కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది.

చిత్తడి రహదారులు



మరిపెడ రూరల్: మండలంలోని సోమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని అంతర్గత రోడ్లన్ని బురదమయంగా మారాయి. దీంతో తండాలో విపరీతమైన దోమలు వ్యాపించి అంటువ్యాధులు సోకే అవకాశం ఉందని తండా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రహదారుల్లో సీసీ నిర్మించినప్పటికీ వాటిపై రెండు ఫీట్ల ఎత్తుతో మట్టి పోశారు. అడుగున సీసీ, పైన మట్టి ఉండడంతో నీరు భూమిలోకి ఇంకిపోయే అవకాశం లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపట్టి, మురుగునీరు తొలగించాలని తండా ప్రజలు కోరుతున్నారు.

బస్సులో ఉక్కిరిబిక్కిరి..



బస్సు వద్ద గుంపులుగా విద్యార్థులు

డోర్నకల్: మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్ విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోర్నకల్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌లో సుమారు 750 మంది ఉండగా వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు మహబూబాబాద్ డిపోకు చెందిన రెండు బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు ట్రిప్పుల చొప్పున నడుపుతున్నారు. అమ్మపాలెం నుంచి డోర్నకల్ మీదుగా మోడల్ స్కూల్‌కు వెళ్లే మొదటి ట్రిప్పు బస్సులో ప్రతీ రోజూ 100నుంచి 120 మంది వరకు వెళ్తున్నారు. అతి రద్దీగా ఉన్న బస్సులో ప్రయాణించేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అద్దెభవనంలోకి అంగన్‌వాడీ చిన్నారులు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడ: ఎట్టకేలకు అంగన్‌వాడీ పాఠశాల నిర్వహించేందుకు అధికారులు మండలకేంద్రంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని విద్యార్థులను మార్చారు. 'గూడు చెదిరిన అంగన్‌వాడీ' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితం అయిన కథనానికి పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హుటాహుటిన సీడీపీఓ నీలోఫర్ అజ్మీ మండలకేంద్రానికి చేరుకుని విచారించారు. మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ సహకారంతో విద్యార్థులను అద్దె భవనంలోకి మార్చారు. అంగన్‌వాడీ సొంతభవనాన్ని పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనం కూల్చి అదే స్థానంలో నూతన భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశించినట్లు తెలిసింది.



చిన్నారులతో సీడీపీఓ నీలోఫర్ అజ్మీ

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని ఏ క్యాబిన్ రైల్వే గేటు ప్రాంతంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని విక్రమ్ నగర్ కాలనీ చెందిన న్యూడెమోక్రసీ నాయకుడు తెల్లబోయిన లక్ష్మయ్య తన ద్విచక్రవాహనంపై ఓసీ క్లబ్ వైపు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. రైల్వే మూడో లైను నిర్మాణ పనులు జరుగుతుండగా.. ఓ రైలు పట్టాను రోడ్డు అడ్డంగా ఏర్పాటు చేసి ఉంచారు. గుర్తించని లక్ష్మయ్య తన వాహనంతో పట్టాను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై బాధితుడి అన్నకుమారుడు కృష్ణ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. రైల్వే మూడో లైన్ పనులు చేస్తున్న నిర్వాహకులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకుండా ప్రజలు ప్రమాదాల బారినపడేలా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపించారు.

సమస్యలపై దశలవారీగా పోరాటాలు

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

దంతాలపల్లి: సమాజంలో ఉపాధ్యాయ, విద్యారంగంపై ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై దశలవారీగా పోరాటం చేస్తామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 19నెలలు గడిచిన విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మూడు దశాలుగా పోరాటం చేస్తామని గుర్తుచేశారు. మొదటి దశలో 23–24 తేదీలలో మండలస్థాయిలో తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత, రెండోదశలో జిల్లాలో ఆగస్టు 1న ధర్నాలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, విజయ్, వంశీకృష్ణ, పార్వతి, రజిత, వెంకన్న, చిరంజీవి, వెంకటేశ్వర్లు, అనిల్ పాల్గొన్నారు.

పూర్వప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

కురవి: పూర్వ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుపై మార్గదర్శకాలు విడుదల చేసి అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సూదనపల్లి యూపీఎస్‌లో సంఘం మండల అధ్యక్షుడు గుండ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 210 పూర్వ ప్రాథమిక పాఠశాలలకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వాటి ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయలేదని తెలిపారు. విద్యారంగాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, నాయకుల ఓదెల శివకుమార్, గుగులోత్ వెంకన్న, ధరావత్ వెంకన్న, చెన్నూరు శ్రీనివాస్, గోనె కార్తీక్, బాలరాజు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో బతకాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఇందిర మహిళా శక్తి పథకం తీసుకువచ్చారని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్‌లో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు, బ్యాంకు లింకేజీ, రుణాలు లోన్ బీమా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యమన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు సమాజంలో స్వేచ్ఛ సమానత్వంతో ఆర్థికంగా బలోపేతం చెందుతూ ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయినపల్లి అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేఖ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కావ్యశ్రీ, కార్యదర్శి పావని, చెన్నూరి విజయలక్ష్మి, నారోజు సత్యమనోరమ, అనంతుల రాజమ్మ, లకావత్ పద్మ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాసంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని, పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలంలోని ఉమ్మడి గుండెంగ గ్రామానికి చెందిన నాయకులు జిల్లా కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టె వెంకన్న, నాయకులు మాధవపెద్ది రమేష్ చందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, వీరస్వామి, శ్రీపాల్ రెడ్డి, మంగీలాల్, శ్రీనివాస్, భోజ్యా పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మహబూబాబాద్: మానుకోట నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులోని వివేకానంద సెంటర్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు సుమారు రూ.5కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రమేశ్, ఖలీల్, గిరిధర్ గుప్తా, నిమ్మల శ్రీనివాస్, పోతు రాజు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోల్ శివారులో దళితుల భూమిని కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీమా నాయక్ డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రజాలి పేట గ్రామ దళితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా బీమానాయక్ మాట్లాడుతూ.. బేతోల్ శివారులోని సర్వే నంబర్ 208/సీలోని ఎకరం ఒకగుంట భూమి కబ్జా విషయంలో అధికారులు విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే గ్రామ శివారులోని రెండు ఎకరాల 8గుంటల భూమిని ఫోర్జరీ సంతకాలతో కబ్జా చేశారన్నారు. భూకబ్జా చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితులు మల్లయ్య, ఎర్రమ్మ, సరిత, రాములు, నాగమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిన్న బీఆర్‌ఎస్‌లోకి.. నేడు కాంగ్రెస్‌కి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం లూనావత్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోతు బిట్లు నాయక్ గురువారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాడు. శుక్రవారం తిరిగి మళ్లీ సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లోకి వెళ్లాడు. 24గంటలు గడవక ముందే సొంత పార్టీలోకి వెళ్లిన బిల్లునాయక్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్నాడు.

వాహన తనిఖీలు

బయ్యారం: మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం బయ్యారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి అనుమానితుల వాహనాలను నిలిపి వివరాలను తెలుసుకొని వదిలిపెట్టారు.

ఉచిత ఆన్‌లైన్ క్లాసులు

కేసముద్రం: మండలంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్ క్లాసులు శుక్రవారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ పరిమి నవీన్ తెలిపారు. ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకుగాను నిర్వహించే ఆన్‌లైన్ క్లాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, పార్థసారథి, రమేష్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నెల్లికుదురు: మండల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ సీపీఎం నాయకుడు సైదులు మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు.

విద్యుదాఘాతంతో మూగజీవాల మృతి

గార్ల: గార్ల మండలం చిన్నకిష్టాపురం పంచాయతీ దేశ్యాతండాకు చెందిన రైతు భూక్యా రూప్లా శుక్రవారం ఉదయం తన మూగజీవాలను మేతకు వదిలాడు. మేత మేసుకుంటూ వెళ్లిన మేక, గొర్రె కిందపడిన విద్యుత్ తీగలకు తాకడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

తొర్రూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం డీటీఎఫ్ ఎంతో కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించిన సంఘం నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థులకు అవగాహన

మరిపెడ: విద్యార్థులకు పలు అంశాలలో వారిని తీర్చిదిద్దాలని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ హరిసింగ్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తెలంగాణ గిరిజన అభివృద్ధి సంస్థ సహకారంతో వాయిస్ ఫర్ చేంజ్ అనే సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ బి.రమేష్, బోధన సిబ్బంది, సంస్థ నిర్వాహకులు జాబిల్లి సాయికృష్ణ, రాజ్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన పరికిపండ్ల అశోక్



కేసముద్రం: కరీంనగర్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆయన స్వగృహంలో, మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరికిపండ్ల అశోక్ శుక్రవారం కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ



మహబూబాబాద్: హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్సీ తక్కెళ్ల పల్లి రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఉన్నారు.

విజయవంతం చేయాలి

గూడూరు: ఉమ్మడి రాష్ట్రంలో మంద కృష్ణమాదిగ చేపట్టిన ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే వికలాంగ హక్కుల పోరాట సమితికి ప్రాణం పోసినట్లు అయిందని జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య, జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి అన్నారు. మండలంలోని పొనుగోడులో శుక్రవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల సమావేశం నిర్వహించారు. ఈనెల 23న మానుకోట జిల్లాలో నిర్వహించే మంద కృష్ణమాదిగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మరిపెడలో సీఐటీయూ మహాసభలు

నెహ్రూసెంటర్: అనునిత్యం కార్మిక వర్గ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు అక్టోబర్ రెండోవారంలో నిర్వహిస్తునట్లు సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, దుండి వీరన్న పాల్గొన్నారు.

కళాశాలలో వనమహోత్సవం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు కళాశాల పరిసరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాజు, సంతోష్‌రెడ్డి, మైసయ్య, రాజు, రవి, యాదగిరి, ప్రవీణ్, మహమ్మద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్లో డే

డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వివిధ రంగులను పరిచయం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఎల్లో డే నిర్వహించారు.

బాలికలు జాగ్రత్తలు పాటించాలి

కురవి: బాలికలు ఎదిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని వాయిస్ ఫర్ ఫోర్ గర్ల్స్ కోఆర్డినేటర్ ఇమిమా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబు, హెచ్‌డబ్ల్యూ ఓఎం.సునీత, పీడీ అనిల్‌కుమార్, అమర్‌సింగ్, వెంకన్న, రవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భద్రకాళి వేడుకలు

కురవి: ప్రతీ ఏటా ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి పర్వదినోత్సవాన్ని అంత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న లక్ష్మి భర్త బాషబోయిన వీరన్న ఇటీవల మృతి చెందాడు. ఈఘటనపై విచారం వ్యక్తం చేసిన హెచ్‌ఎం లీలా శోభరాణితోపాటు ఉపాధ్యాయ బృందం శుక్రవారం రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

క్రైం కార్నర్..

ఏడాది జైలు, రూ.10వేల జరిమానా

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం చోరీ చేసిన ఘటనలో ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిమురారి తీర్పు ఇచ్చారని కోర్టు డ్యూటీ అధికారి, హెడ్ కానిస్టేబుల్ బీరం సంపత్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కురవి గేటు ప్రాంతంలో నివాసం ఉండే గండు ముత్తయ్య ఆరునెలల క్రితం తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లడంతో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై బి.విజయకుమార్ విచారణ చేపట్టాడు. మేజిస్ట్రేట్ స్వాతిమురారి ద్విచక్రవాహనం చోరీ కేసులో నేరం నిరూపణ కాబడిన, కురవి మండలంలోని నారాయణపురం గ్రామ శివారు ధరావత్ తండాకు చెందిన ధరావత్ బావుసింగ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వృద్ధురాలి మెడలోంచి చైన్ స్నాచింగ్



కేసముద్రం: పంటపొలం వద్ద నారుమడికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పరారైన సంఘటన కేసముద్రం మండలం కల్వల గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వల గ్రామానికి చెందిన బొడ్డు వెంకటమ్మ నారు మడికి నీళ్లు పెట్టడానికి వెళ్లింది. ఈ క్రమంలో నారుకు నీళ్లు పెట్టిన ఆమె రోడ్డుపైకి వచ్చి నిలబడి ఉండగా, ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండుతులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దీంతో వృద్ధురాలు కేకలు పెట్టడంతో చుట్టుపక్కలున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. కాగా తమబావి వద్ద తరచు విద్యుత్‌మోటార్‌లు చోరికి గురవుతుండటంతో, ఆ వృద్ధురాలి మనుమడు నందు వ్యవసాయబావి వద్ద సీసీ కెమెరాలను ఇటీవలే ఏర్పాటు చేశాడు. దీంతో చోరీకి పాల్పడటానికి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చిన దృశ్యాలు అందులో నమోదయ్యాయి. కాగా విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలానికి రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు, పోలీస్ సిబ్బంది చేరుకుని విచారణ జరిపారు. పరారైన ఆ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

చోరీపై కేసు నమోదు

తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామంలో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన యాసారపు రామచంద్రు దంపతులు తమ కుమారై ఇంటికి వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.50వేల నగదు, ఇంట్లో ఉన్న ఇతర వస్తువులను దొంగిలించినట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని వేధించిన యువకుడిపై..

మహబూబాబాద్ రూరల్: ప్రేమ పేరుతో బెదిరింపులకు పాల్పడిన ఓ యువకుడిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ పట్టణ పరిధిలోని ఓ యువతి ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిమిత్తం వరంగల్ వెళ్లింది. ఎగ్జామ్ సెంటర్ వద్ద మరిపెడ మండలం ఎడ్జర్ల గుర్రపుతండా గ్రామానికి చెందిన బానోతు భానుప్రసాద్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఆ యువకుడు ఆమె ఫోన్ నంబర్ తీసుకుని ఆమెను ప్రేమిస్తున్నానని, ప్రేమించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు బానోతు భానుప్రసాద్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఫోన్‌పే నుంచి డబ్బులు బదిలీ

మహబూబాబాద్ రూరల్: ఓ వ్యక్తి ఫోన్ పే ఖాతా నుంచి మరో వ్యక్తి బ్యాంకు ఖాతాకు డబ్బులు బదిలీకాగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీలో నివాసం ఉండే మల్లు రమేష్ తన ఇంట్లో నిద్రిస్తున్నాడు. జూన్ 12వ తేదీన తెల్లవారు జామున అతడి ఫోన్ పే ఖాతా నుంచి హ్యాపీ పెట్ షాప్ అండ్ డాగ్స్ ఫుడ్ యాక్సెస్సరీస్ ఫోన్ పే ఖాతాకు రూ.30వేలు బదిలీ అయ్యాయి. దీంతో బాధితుడు రమేష్ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జేసీబీ స్పేర్ పార్ట్స్ చోరీ

డోర్నకల్: రోడ్డు పక్కన నిలిపిన జేసీబీ యంత్రం నుంచిగుర్తు తెలియని వ్యక్తులు స్పేర్ పార్ట్స్ కిట్ చోరీ చేశారు. ఎస్సై గడ్డం ఉమ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమాళ్ల సంకీస గ్రామానికి చెందిన కిన్నెర కృష్ణయ్య తన జేసీబీ యంత్రాన్ని గ్రామ శివారు కాంపెల్లి మార్గంలో గంగమ్మ గుడి వద్ద నిలిపాడు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు యంత్రం అద్దాలు పగలగొట్టి రూ.25 వేల విలువైన స్పేర్ పార్ట్స్ చోరీ చేశారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


ఐటీడీఏను ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం మహబూబాబాద్‌లో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాం నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలో జరిగిన ఆసంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు.

గిరిజన యువతికి సత్కారం

తొర్రూరు: మూడు ఉద్యోగాలు సాధించిన గిరిజన యువతిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సత్కరించారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామ శివారు కస్నా తండాకు చెందిన బానోతు అనూష ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్, ఐడీబీఐలో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం అనూషను సత్కరించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, పార్టీ సత్తా చాటాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝాన్సీరెడ్డిని డప్పుచప్పుళ్ల నడుమ, ఆటపాటలతో కోలాటలు వేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేపడుతూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జాటోతు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, రాఘవరావు, నెహ్రూనాయక్, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.